

రైల్వేలో ఎన్నికల వేడి!

సౌత్ సెంట్రల్ రైల్వే కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డెలిగేట్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో రైల్వే కార్మిక వర్గాల్లో ఎన్నికల సందడి మొదలైంది. -8లో



నెల్లూరు, అనంత జట్ల విజయం

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. -8లో

గరిష్ఠం/కనిష్ఠం

33.3/26.3

వాతావరణం

జిల్లాలో గురువారం 26.3 – 33.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

బీసీ శాసనసభ కమిటీ సభ్యుల పర్యటన వాయిదా

కడప రూరల్ : బీసీ శాసనసభ కమిటీ సభ్యుల అధికారిక పర్యటన వాయిదా పడినట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి బ్రహ్మయ్య తెలిపారు. కమిటీ సభ్యులు శుక్రవారం జిల్లాలో పర్యటించాల్సి ఉందన్నారు. అయితే కొన్ని కారణాలతో పర్యటన వాయిదా పడిందని తెలిపారు.

8న విలువిద్య జట్టుకు ఎంపికలు



కడప స్పోర్ట్స్: నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ఈ నెల 8న ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి విలువిద్య జట్టుకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విలువిద్య సంఘం అడ్‌హాక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, రాచవీటి తేజేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. కడప జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. వీరు ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు వేంపల్లి పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2008 జనవరి తర్వాత పుట్టిన క్రీడాకారులను జూనియర్ విభాగానికి ఎంపిక చేస్తామన్నారు.

7, 8 తేదీల్లో క్విజ్ పోటీలు

కడప కల్చరల్: కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో సీరతున్న బీ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అమ్మద్ తెలిపారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని మదరసాల విద్యార్థులకు శనివారం ఉదయం, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఆదివారం పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులను సీనియర్లుగా పరిగణించి విజేతలైన వారికి ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తృతీయ బహుమతి రూ. 3 వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు జూనియర్ గ్రూప్‌గా పరిగణించి విజేతలకు ప్రథమ బహుమతి రూ. 5 వేలు,ద్వితీయంబహుమతి రూ. 3 వేలు, తృతీయ బహుమతి రూ. 2 వేలు అందజేస్తామని తెలిపారు. కడప నగరంలోని అల్మాస్‌పేటలో ఉన్న జామియా తుస్సాలిహాత్ మదరసాలో పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల వారు 99857 73395 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, ఎస్. ఈశ్వరరెడ్డి తదితరులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతాసుధాకర్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలకు 2203 మంది హాజరుకాగా, 1959 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎంఈడీ ఒకటి, నాలుగు సెమిస్టర్ పరీక్షలకు 149 మంది హాజరు కాగా 137 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డా. ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీషు గెస్ట్ అధ్యాపకుడిగా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ హర్షలతా పంకజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎస్‌ఈటీ, ఎన్‌ఈటీ, పీహెచ్‌డీ చేసిన వారు అర్హులన్నారు. అన్ని సర్టిఫికెట్లతో ఈనెల 7వ తేదీ ఉదయం కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

సీనియారిటీ జాబితా విడుదల

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రాథమిక సీనియారిటీ జాబితా గురువారం విడుదల చేసినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతులు కల్పించేందుకు ఈ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారులకు పంపామని, 7వ తేదీలోగా అభ్యంతరాలను మెయిల్ ద్వారా లేదా పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులకు rjdse kadapa@ap schooledu.in ద్వారా పంపాలని సూచించారు. అక్టోబరు 10వ తేదీలోపు అభ్యంతరాలు పరిష్కరించి 11న సీనియారిటి జాబితా రూపొందిస్తామన్నారు. 12న సర్వీసు రిజిస్టర్, డాక్యుమెంట్ల పరిశీలన, 13న పోస్టింగ్ ఆర్డర్లు అందజేస్తామని ఆయన వివరించారు. పూర్తి జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్ చూడాలన్నారు.

బాలికా విద్యకు భరోసా

తల్లిదండ్రులను కోల్పోయిన, ఆర్థిక స్థోమత లేక అర్ధంతరంగా చదువు ఆపేసిన బాలికలను ఉన్నత విద్యా వంతులుగా తీర్చిదిద్దడంలో కస్తూర్బాగాంధీ విద్యాలయాలు అండగా నిలుస్తున్నాయి. ఉన్నత విద్య, ఆహ్లాదకరమైన వాతావరణం, ఆంగ్ల మాధ్యమంలో బోధన, యోగా, క్రీడలు, ఇతర సదుపాయాలు కల్పిస్తూ వారి భద్రతకు భరోసా కల్పిస్తున్నాయి. వృత్తి విద్య వారి బతుకుదెరువుకు మార్గం చూపుతోంది.





కేజీబీవీ విద్యార్థులు (ఇన్‌సెట్) మైదుకూరు కేజీబీవీ

- కేజీబీవీలలో ఉన్నత విద్య.. నాణ్యమైన భోజనం
- 6 నుంచి10వ తరగతి వరకు అన్ని వసతులతో బోధన
- చదువుతోపాటు క్రీడలు, వృత్తి విద్యా కోర్సులు
- నాడు–నేడుతో రూపురేఖలు మారిన కస్తూర్బాలు

కడప ఎడ్యుకేషన్: దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 2005లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీలు)ఏర్పాటు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 'నాడు–నేడు మనబడి' కార్యక్రమంతో అన్ని కేజీబీవీలకు వసతులు, సౌకర్యాలు కల్పించారు. పదోతరగతి అనంతరం విద్య మానేయకుండా వాటిలోనే ఇంటర్ విద్య ప్రవేశపెట్టారు. వైఎస్సార్ జిల్లాలో 17 కేజీబీవీలున్నాయి. వాటిలో ఆరో నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య బోధిస్తున్నారు. ఒక్కో తరగతికి 40 మంది విద్యార్థులు ఉంటారు. పదో తరగతిలో గత ఏడాది 462 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 449 మంది ఉత్తీర్ణులయ్యారు. సింహాద్రిపురం నుంచి చంద్రమహేశ్వరి 564, కలశపాడు కేజీబీవీ నుంచి కరుణ 561, చక్రాయపేట నుంచి పవిత్ర 555 మార్కులు సాధించి సత్తా చాటారు. జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికయ్యారు.

2018లో ఇంటర్ విద్యకు శ్రీకారం...

ఉమ్మడి జిల్లాలో దశలా వారీగా 19 కేజీబీవీల్లో ఇంటర్ తరగతులను ప్రారంభించారు. 2018లో రెండు, 2019లో 8, 2020లో తొమ్మిది కేజీబీవీల్లో ఇంటర్ విద్య ప్రవేశపెట్టారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులతో పాటు సీఈసీతోపాటు బ్యూటీ వెల్‌నెస్, టెలికా, ఐటీ, ఐటీసీఎస్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్, కుట్లు అల్లికలు వంటి వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నారు. దీంతో పది తరువాత డ్రాపౌట్స్‌గా మారకుండా ఇంటర్ విద్య కొనసాగిస్తూ బాలికలు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

అన్ని వసతులతో..

కేజీబీవీలలో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వాచ్‌మెన్, వంట మనుషులంతా మహిళలే. ఇక్కడ చదువుతున్న బాలికలకు ఉన్నత విద్య అందించేలా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేజీబీవీల్లో ఇటీవల 121 పోస్టులను భర్తీ చేయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్య బోధనకు ఏర్పాట్లు చేశారు. చదువుతోపాటు నాణ్యమైన భోజనం, వసతి కల్పిస్తున్నారు. విద్యార్థులకు యూనిఫాం, షూ, దుప్పట్లు అందజేస్తున్నారు. స్వయం ఉపాధి కోర్సులు, చిత్ర లేఖనం, యోగాలో శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలలకోసారి ఆరోగ్య పరిశుభ్రత కిట్లు అందజేస్తారు. బాలికా సాధికారత క్లబ్‌ల ఏర్పాటుపై వారికి అవగాహన కల్పిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో హవా



ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన అట్లూరు కేజీబీవీ విద్యార్థులు

జిల్లాలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో(ఎస్‌జీఎఫ్) కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సింహాద్రిపురం కేజీబీవీ నుంచి అండర్ –19 అథ్లెటిక్స్‌లో రూబీ, నెట్‌బాల్‌లో లిఖిత, ఆకాశ్య ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. చక్రాయ పేట కేజీబీవీ నుంచి రగ్బీలో రుఖియా, హ్యాండ్‌బాల్‌లో మస్తాన్‌బీ, అట్లూరు కేజీబీవీ నుంచి అండర్ 17 రెజ్లింగ్‌లో హారిక, అండర్–17 200 మరియు 800 మీటర్ల పరుగు పందెంలో చందన, అండర్ –17 షాట్‌పుట్‌లో హారిక, పందు, అండర్–14 సాఫ్ట్‌బాల్‌లో వెంకట సుధ, ఆశ, వెంకటలక్ష్మమ్మ, నాగేశ్వరి, వేముల కేజీబీవీలో అండర్–19 రెజ్లింగ్‌లో నలుగురు, అండర్–19 హాకీలో ఒకరు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు.

బాలికలకు ఉజ్వల భవిత



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కస్తూర్బా పాఠశాలలో చదివే బాలికలకు విద్యతోపాటు వారి భవిష్యత్తు తీర్చిదిద్దుకునేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. వాటితోపాటు జీవనోపాధికి అవసరమైన వృత్తి విద్య కోర్సులు నిర్వహిస్తున్నాం. బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు యోగా, క్రీడల్లోనూ శిక్షణ ఇస్తున్నాం.

– విజయలక్ష్మి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సమగ్ర శిక్ష, వైఎస్సార్ జిల్లా

ఉన్నత విద్యా బోధన



కేజీబీవీలలో ఉన్నత విద్యా బోధన అందుబాటులో ఉంది. ఇంటర్ విద్యార్థుల బోధనకు ఇబ్బంది లేకుండా ఇటీవల సీఆర్‌టీ, పీజీటీలను నియమించాం, కొన్ని కేజీబీవీలలో ప్రిన్సిపల్స్‌తోపాటు పీఈటీ పోస్టులు భర్తీ చేయించాం. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి. కడప

రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన బీజేపీ

పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు



మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ రాష్ట్రానికి విభజన హామీల రూపంలో రూ.5లక్షల కోట్లు మేలును చట్టరూపంలో చేస్తే వాటిని అమలుచేయకుండా తుంగలో తొక్కి బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందని పీసీసీ అధ్యక్షుడు గిడుగురుద్రరాజు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మదనపల్లెలో సేవ్ కానిస్టిట్యూషన్, డెమోక్రసీ, నేషన్ నినాదంతో ర్యాలీ, బహిరంగసభ నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మయప్పన్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాగౌతమ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు సాకేశంకర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభానికి ముందు స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులతో కలిసి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిదన్నరేళ్ల కాలంలో దేశంలో కులాలు,మతాలు, జాతులు, రాష్ట్రాల మధ్య వైషమ్యాలను సృష్టించి పబ్బం గడుపుతోందన్నారు. దేశానికి రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని, బీజేపీ ప్రధాని నరేంద్రమోదీ కబంధహస్తాల నుంచి విముక్తి పొందాలన్నారు.మదనపల్లెలో ఏపీ పునర్విభజన చట్టం–2014లో అప్పటి ప్రధాని మన్మోహన్, యూపీఏ చైర్మన్ సోనియా రాయలసీమ, ఉత్తరాంధ్రలోని వెనుకబడిన జిల్లాలకు ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని అమలుచేయాలని సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమృతతేజ, షేక్‌అల్లాబక్షు, గోశాలదేవి, మన్సూర్‌అలీ, మహమ్మద్‌షరీఫ్, డాక్టర్. వర్ధన్‌చౌదరి, ఎం.ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్ర యాదవ్, లీలాశ్రీనివాస్, సోమశేఖర్‌రెడ్డి, పూలభాస్కర్, రెడ్డిసాహెబ్, సురేంద్ర, వేల్పులశ్రీధర్, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కేసులు

కలెక్టర్ విజయరామరాజు



మొక్క నాటుతున్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే

ఖాజీపేట: బాల్య వివాహాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, వివాహం చేసిన పూజారులు, బాలికల తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ విజయరామరాజు హెచ్చరించారు. ఖాజీపేట మండలం పుల్లూరులో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో కలిసి కలెక్టర్ విజయరామరాజు గురువారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కళ్యాణ మండపంలో వివాహం జరిగితే ఆ మండపం సీజ్ చేస్తామన్నారు. ఆడపిల్లల వెంట పడినా, ఆకతాయి పనులు చేసినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలతో గ్రామ పాలన తీసుకు వచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మండలానికి రూ.24 కోట్ల పరిహారం లభించిందన్నారు. ప్రజలకు మంచి చేయాలని ఆలోచిస్తున్న సీఎం జగన్‌కు అందరూ మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి నాగిరెడ్డి, ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, అబూబకర్ సిద్ధిక్, అచ్చుకట్ల కరీముల్లా, రాఘవరెడ్డి, పల్లె యేసురత్నం, వీరారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సౌభాగ్యం

- 32 కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు
- మోచంపేటలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్ బాషా

కడప రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు స్థానిక ప్రజలతో పోటెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాల్లో గురువారం మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాలకు జనాలు వెల్లువలా తరలివచ్చారు. ఇక్కడ లభిస్తున్న ఉచిత వైద్య సేవలను అంతా సద్వినియోగం చేసుకుంటున్నారు. కడప నగరం మోచంపేటలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు మాసీమ బాబు, చిలమకూరులో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, బద్వేలు గాంధీనగర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొన్నారు. ఖాజీపేట మండలం పుల్లూరులో నిర్వహించిన మెడికల్ క్యాంపులో కలెక్టర్ విజయరామరాజు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మిగిలిన ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ శిబిరాల ద్వారా ఆరోగ్య సౌభాగ్యం చేకూరుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


ఉపాధ్యాయులే.. దేశ భవిష్యత్తు నిర్మాతలు

- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
- ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం
- 'ఆకేపాటి' ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో 400 మందికి పురస్కారాలు




మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: దేశ భవిష్యత్తు నిర్మాతలు ఉపాధ్యాయులేనని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. అజ్ఞానాన్ని తొలగించి పిల్లల్లో క్రమశిక్షణ నేర్పి ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులదేనన్నారు. అందుకే ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో గౌరవప్రదమైన స్థానముందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో కడప, రాజంపేట పార్లమెంటు పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 400 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 1982లో వైఎస్.రాజశేఖరరెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయుల జీతభత్యాలు, ఇతర సమస్యలను పరిష్కరించారన్నారు. సీఎంగా ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చి పేదలకు ఉన్నత విద్య చదివే అవకాశం కల్పించారన్నారు. నేటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులే దేశ ఆర్థిక నిర్మాతలు అన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్యకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. మన విద్యార్థులు ఐక్యరాజ్య సమితిలో ప్రతిభ చాటుతున్నారని కొనియాడారు. కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ పిల్లలను క్రమశిక్షణలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. క్రమశిక్షణతోనే భవిష్యత్తు సాధ్యపడుతుందన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులనే ఆదర్శంగా తీసుకుంటారని చెప్పారు. తమ జిల్లాలో 12000 కంటి ఆపరేషన్లు, 1000 మంది టీబీ రోగులను ఆదుకునే విషయంలో ఆకేపాటి ఫౌండేషన్ ఇచ్చిన సాయం మరువలేనిదన్నారు. మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ అవినీతికి తావు లేని రంగం ఏదైనా ఉందంటే అది ఉపాధ్యాయ రంగమేనని కొనియాడారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి రూ. 58 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు, బాత్‌రూమ్‌లు, ఫ్యాన్లు, ఇతర సదుపాయాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, కడప, అన్నమయ్య డీఈఓలు రాఘవరెడ్డి, పురుషోత్తంతోపాటు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు, వారి బంధుమిత్రులు



సన్మానిత ఉపాధ్యాయులతో నాయకులు, తదితరులు

అంతు చిక్కని కారణం

- భార్య, పిల్లలను కాల్చి హెడ్ కానిస్టేబుల్ ఘాతుకం
- వివాహేతర సంబంధమే కారణమా..
- జూన్ నెలలో కొని ఇప్పుడెందుకు డాక్యుమెంట్ రాసినట్లు..



వెంకటేశ్వర్ ఇంటి బెడ్‌రూంలో మృతదేహాలు



హత్యకు ఉపయోగించిన పిస్టల్



లాస్య (ఫైల్)



అభిజ్ఞ (ఫైల్)

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లాలో సంచలనం సృష్టించిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్ ఇంట్లో కాల్పుల ఘటనపై కారణాలు అంతుచిక్కడం లేదు. ఆర్థిక సమస్యలు, మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉండటమే కారణమా? లేక ఇంకా ఏమైనా ఉన్నాయా? అనే విషయాలు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలియాల్సి ఉంది. వివరాలివీ..

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల టౌన్‌కు చెందిన టి. వెంకటేశ్వర్ 1993లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. తర్వాత హెడ్ కానిస్టేబుల్‌గా (హెచ్‌సీ. 1695)గా పదోన్నతి పొందాడు. ఈ క్రమంలోనే ట్రాన్స్‌కో విజిలెన్స్‌లో పనిచేశాడు. ఇతనికి భార్య మాధవి (47) కుమార్తెలు లాస్య (21), అభిజ్ఞ (16) ఉన్నారు. మొదటి కుమార్తె డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. రెండో కుమార్తె కో–ఆపరేటివ్ కాలనీలో విద్యామందిర్‌లో 10వ తరగతి చదువుకుంటోంది. వీరు విద్యామందిర్ స్కూల్‌కు సమీపంలోని ఓ ఇంటిలో నివాసం ఉంటున్నారు.

వివాహేతర సంబంధమే..

కాగా, కడప చిన్నచౌక్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో యారాసు రమాదేవితో పరిచయం ఏర్పడింది. ఆమె రాజారెడ్డి వీధిలో కుమారుడు నాగలోకేశ్వర్‌రెడ్డితో పాటు నివాసముంటోంది. ఆమెతో వివాహేతర సంబంధం కలిగి ఉన్న హెడ్‌కానిస్టేబుల్ టి. వెంకటేశ్వర్ ప్రస్తుతం కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది జూన్ 23న కొనుగోలు చేసి పిల్లలను చంపిన తర్వాత నగదు, ఆస్తులు రమాదేవికి చెందాలని అక్టోబర్ 4న రాసిన డాక్యుమెంట్ పోలీసులకు లభ్యమైంది.

ఎస్సైకు సంబంధించిన పిస్టల్‌తో..

బుధవారం రాత్రి రాత్రి 10:30 గంటల వరకు సీఐ సయ్యద్ హాసం, ఎస్‌ఐలతో కలిసి విధులు నిర్వహించి ఇంటికి వచ్చాడు. ముందుగా అనుకున్న ప్రకారం తన కస్టోడియన్‌లో వున్న ఓ ఎస్ఐకి సంబంధించిన పిస్టల్‌ను, బుల్లెట్‌లను తీసుకుని ఇంటికి వచ్చాడు. భార్య,పిల్లలు నిద్రిస్తుండగా పిస్టల్‌తో ముగ్గురిని కాల్చిచంపాడు. తర్వాత తాను కాల్చుకుని చనిపోయాడు. మరో వైపు ఈ సంఘటన జరిగిన తర్వాత కడప డీఎస్పీ కార్యాలయానికి వెళ్లిన రమాదేవి, తాను హెడ్ కానిస్టేబుల్ టి. వెంకటేశ్వర్‌కు రెండో భార్యను కాననీ, కేవలం తనతో పరిచయం ఏర్పడి, సహజీవనం చేసే వారని పోలీసులకు తెలియజేసినట్లు సమాచారం. ఈ సంఘటనపై వెంకటేశ్వర్ సోదరి సువర్ణలతతో మాట్లాడగా వివాహేతర సంబంధం గురించి తనకు తెలియదని చెప్పింది.

స్థలాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం, మేయర్

భార్య, పిల్లలను చంపి, తాను ఆత్మహత్యకు పాల్పడిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ ఇంటిని, మృతదేహాలను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీఅంజద్ బాషా, కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు, పులి సునీల్ కుమార్, అఫ్జల్‌ఖాన్ పరిశీలించారు. డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌లు సిబ్బందిని విచారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కడప చిన్నచౌక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

వీఆర్ఓ అన్యాయం చేశాడు

– తన భూమిని ఇతరుల పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించాడని రైతు ఆవేదన


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో తనకు తమ పెద్దల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమిని వీఆర్‌ఓ మహేష్‌రెడ్డి ఆన్‌లైన్‌లో వేరేవారి పేరు మీద ఎక్కించాడని రైతు చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు తమ పెద్దల నుంచి సంక్రమించిన 318/1, 318/5లో 1.75 సెంట్ల భూమిని వీఆర్‌ఓ ర్వో గోల్‌మాల్ చేశాడని ఆరోపించారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగిన తిప్పుకుంటున్నారే తప్ప న్యాయం చేయడం లేదన్నారు. తన పేరుపైన పాసుబుక్కులు, రిజిస్ట్రేషన్ అన్నీ ఉన్నా కూడా మీ పెద్దలకు ఈ ఆస్తి ఏ విధంగా వచ్చిందని అడుగుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నా భూమిని నాకు ఇవ్వాలని ఆయన కోరారు.

రెండు బైకులకు నిప్పు

– యువకుడిపై కేసు నమోదు


సంఘటనలో కాలిపోయిన బైకులు

మైదుకూరు : పట్టణంలోని సీఎస్ఐ షాలోమ్ టౌన్ చర్చి సమీపంలో రెండు బైకులకు నిప్పంటించిన సంఘటనలో పోలీసులు ఓ యువకునిపై కేసు నమోదు చేశారు. పట్టణంలోని చర్చి వీధిలో భూమిరెడ్డి అన్వేష్, భూమిరెడ్డి తరుణ్ కుమార్ అనే అన్నదమ్ముల పిల్లలకు చెందిన రెండు బైక్‌లను బుధవారం రాత్రి పెట్రోల్‌పోసి కాల్చివేశారు. అదే వీధిలో బాధితుల ఇళ్లకు ఎదురుగా భూమిరెడ్డి మదన్ కుమార్ అనే యువకుడు నివాసం ఉంటున్నాడు. మదన్ అతని భార్య తరచూ గొడవ పడుతుండటంతో అన్వేష్, తరుణ్ కుమార్ ఇద్దరు సర్ది చెబుతుండేవారు. కొద్ది రోజుల కిందట మదన్ కుమార్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తమ కుటుంబ విషయంలో జోక్యం చేసుకుంటున్నారని అన్వేష్, తరుణ్‌పై కోపంతో మదన్ కుమార్ బుధవారం రాత్రి వాటర్ బాటిళ్లలో పెట్రోల్ తీసుకుని వచ్చి వారి బైకులపై పోసి నిప్పటించాడు. సంఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో మదన్ కుమార్‌పై అర్బన్ ఎస్ఐ ఘన మద్దిలేటి కేసు నమోదు చేశారు.

రైల్వేలో క్రెడిట్ సొసైటీ ఎన్నికల వేడి!

- ఊపందుకున్న ఎన్నికల ప్రచారం
- 12న పోలింగ్..4 స్టేషన్లలో ఏర్పాటు
- నాలుగు డెలిగేట్ స్థానాలకు పోటీ
- అభ్యర్థులను బరిలోకి దింపిన మజ్దూర్, సంఘ్



రాజంపేట : సౌత్‌సెంట్రల్ రైల్వే కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డెలిగేట్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో రైల్వే కార్మిక వర్గాల్లో ఎన్నికల వేడి రాజుకుంది. ప్రధానంగా మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ కార్మిక సంఘాలు తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. దీంతో మజ్దూర్, సంఘ్ కార్మిక నేతలు తమ పరిధిలోని సభ్యులను కలుసుకొని తమ డెలిగేట్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. విధుల్లో ఉన్న కార్మికుల వద్దకు వెళ్లి తమను గెలిపించాలని హామీలు గుప్పిస్తున్నారు. నందలూరు, కడప సెక్షన్లలో మజ్దూర్, సంఘ్ నేతలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు.

28 డెలిగేట్ స్థానాలకు...

గుంతకల్ రైల్వే డివిజన్ వ్యాప్తంగా డెలిగేట్ స్థానాలు 28కి చేరుకున్నాయి. ఇందులో మజ్దూర్ యూనియన్ 28 డెలిగేట్ స్థానాలకు పోటీ చేస్తుండగా, ఎంప్లాయిస్ సంఘ్ 27 డెలిగేట్ స్థానాలకు అభ్యర్థులతో ప్యానెల్‌ను విడుదల చేశాయి. కాగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండు డెలిగేట్ స్థానాలు కేటాయించారు. కడప పరిధిలో 260, నందలూరు పరిధిలో 280 మంది సొసైటీ సభ్యులు ఓటర్లుగా నమోదయ్యారు. గెలిచిన డెలిగేట్స్‌లో సొసైటీ డైరెక్టర్లుగా ఎంపిక చేస్తారు. అది డివిజనల్ సెక్రటరీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

12న పోలింగ్..

ఈనెల 12న ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని రెండు డెలిగేట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం నందలూరు, కడప, ముద్దనూరు, జమ్మలమడుగు రైల్వేస్టేషన్ల ఎస్ఎంఆర్ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేశారు. భాకరాపేట నుంచి బాలపల్లె వరకు నందలూరు, కడప, ఎర్రగుంట్లకు కడప, ఎర్రగుంట్ల–నంద్యాల మార్గంలోని సెక్షన్‌లో వారికి జమ్మలమడుగు, కొండాపురం వరకు ఉన్న వారికి ముద్దనూరులో ఓటు వేసేలా రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. ఆరోజు విధి నిర్వహణలో ఉన్న వారు పోస్టల్ బ్యాలెట్ కోసం సికింద్రాబాద్‌లోని సొసైటీలో సంప్రదించి తీసుకోవాల్సి ఉంటుంది.


ఎండీ ఫజల్ అహమ్మద్(సంఘ్)


వై.గంగయ్య (సంఘ్)


గురువినోద్‌కుమార్(మజ్దూర్)


పి.కిరణ్‌బాబు(మజ్దూర్)

పోటీ చేస్తున్న అభ్యర్థులు వీరే..

సొసైటీ ఎన్నికల్లో అభ్యర్థులను మజ్దూర్, ఎంప్లాయిస్ సంఘ్‌లు ప్రకటించాయి. సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తరఫున పి.గురువినోద్‌కుమార్(రాజంపేట), పి.కిరణ్‌బాబు(కడప), సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ తరఫున వై.గంగయ్య(జమ్మలమడుగు), ఎండీ ఫజల్ అహమ్మద్(రాజంపేట) పోటీ చేస్తున్నారు. వీరికి గుర్తులు కూడా కేటాయించారు.

సూళ్లూరుపేటలో బద్వేలు విద్యార్థి మృతి


విక్కీప్రభాస్ (ఫైల్)

బద్వేలు అర్బన్ : తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో బద్వేలులోని గాండ్లవీధికి చెందిన గంటావిక్కీప్రభాస్ (21) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. పట్టణంలోని గాండ్లవీధికి చెందిన గంటారాజశేఖర్, భారతిలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో చివరి వాడైన ప్రభాస్ చెన్నైలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ సూళ్లూరుపేటలోని ఓ అద్దె గదిలో ఉంటుండేవాడు. ప్రతిరోజు సూళ్లూరుపేట నుండి కళాశాలకు వెళ్లి వస్తుండేవాడు. అయితే గురువారం తెల్లవారుజామున ప్రభాస్‌కు తీవ్ర గుండె పోటు రావడంతో గదిలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని బద్వేలుకు తీసుకువచ్చారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

అదృశ్యమైన యువకుడు ఏమయ్యాడు?


రవిశేఖర్ (ఫైల్)

గోపవరం : ఈ నెల 1వ తేదీ ఆదివారం బర్రెలను వెతికేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లిన రవిశేఖర్ ఆచూకీ ఇంత వరకు లభించలేదు. మండలంలోని కాలువపల్లె గ్రామ పంచాయతీ లక్కవారిపల్లె గ్రామానికి చెందిన రవిశేఖర్ అక్క, బావ, మరికొందరితో కలిసి బర్రెలను వెతికేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రానికి రవిశేఖర్ మినహా మిగిలిన వారు ఇళ్లకు చేరుకున్నారు. రవిశేఖర్ కనిపించకుండా పోయినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు సోమవారం బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది, రవిశేఖర్‌కు సంబంధించిన బంధువులు గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమ, మంగళవారాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఐదురోజులు గడిచినా ఆచూకీ లేకపోవడంతో భార్యతో పాటు తల్లి, బంధువులు ఆందోళనకు గురవుతున్నారు. అసలు అదృశ్యమైన రవిశేఖర్ ఏమయ్యాడు?, ఉన్నట్లా.. లేనట్లా అన్న సందేహం కూడా కుటుంబ సభ్యులు, గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది. రవిశేఖర్ తండ్రి ఎప్పుడో చనిపోయాడు. తల్లికి మతిస్థిమితం లేదు. మూడు నెలల క్రితం వివాహం చేసుకున్న రవిశేఖర్ తల్లి ఆలనాపాలన చూసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో అతను అదృశ్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది.

శాశ్వత లోక్‌అదాలత్‌తో సామరస్య పరిష్కారం

కడప శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్


మాట్లాడుతున్న జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్

వైవీయూ : శాశ్వత లోక్‌అదాలత్‌తో వివాదంలో ఉన్న విషయాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తున్నట్లు జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో 'ప్రజా ప్రయోజిత మరియు న్యాయసేవలపై' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత లోక్‌అదాలత్‌లో రవాణాసేవలు, పోస్టల్ టెలిఫోన్ సేవలు, విద్యుత్ సరఫరా కాంతి లేదా నీరు సేవలు, ప్రజాసంరక్షణ లేదా పారిశుధ్యం, ఆసుపత్రి సేవలు, బీమా సేవ, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సంస్థలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఉపాధి పథకం, విద్య, విద్యాసంస్థలు, హౌసింగ్, రియల్‌ఎస్టేట్‌కు సంబంధించిన సేవలను పౌరులు పొందవచ్చన్నారు. సమస్యలకు సంబంధించి అర్హతల ఆధారంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

510 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన లారీతో విజిలెన్స్ అధికారులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు రింగ్‌రోడ్డు సర్కిల్ వద్ద కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమంగా లారీలో తరలిస్తున్న 510 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ షేక్ మాసుంబాషా తెలిపారు. గురువారం ఆయన తెలిపిన సమాచారం మేరకు సీకేదిన్నె మండలం ఊటుకూరు సర్కిల్ వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో లారీని ఆపి తనిఖీలు నిర్వహించామన్నారు. 510 బస్తాలలో సుమారు 24,363 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని సీకే దిన్నె పోలీసుస్టేషన్‌లో అప్పగించామన్నారు. బియ్యాన్ని రవాణా చేస్తున్న ఎర్రగొండపాలెంకు చెందిన ఇడిమిశెట్టి వెంకట శ్రీనివాసరావు, లారీ డ్రైవర్ కొండూరు యోగిరెడ్డిలపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ. 19,86,701 ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బాలగంగాధర్‌రెడ్డి, ఏఓ జనార్దన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ హరనాథరెడ్డి, బుగ్గలపల్లె వీఆర్వో రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు, అనంత జట్ల విజయం


యోగానంద (114) అనంత బ్యాట్స్‌మన్


5 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ భార్గవ్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. కడప నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 189 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు గురువారం బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 88.4 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 280 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 101 పరుగులు, రేవంత్‌రెడ్డి 79 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఆదిల్‌హుస్సేన్ 3, అస్లాం 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 52.2 ఓవర్లలో 211 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వాసుదేవరాజు 35 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు భార్గవ్ 5, అఖిల్ 3 వికెట్లు తీశారు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 354 పరుగులు చేయగా, కడప జట్టు 186 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టు 237 పరుగుల తేడాతో విజయం సాధించింది.

'అనంత' విజయం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో 168 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 44.2 ఓవర్లలో 182 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని తేజారెడ్డి 65 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు మల్లికార్జున 4, కమిల్ 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 65 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసి విజయం సాధించింది. బి. యోగానంద 114, అర్జున్ టెండూల్కర్ 73, దత్తారెడ్డి 70 పరుగులు చేశారు. చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగులు చేయగా, అనంత జట్టు 139 పరుగులు చేసింది. దీంతో అనంతపురం జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

విద్యుత్ షాక్‌తో మహిళా రైతు మృతి

పశుగ్రాసం కోస్తుండగా ఘటన


మృతి చెందిన లక్ష్మీదేవి

చాపాడు : రోజు మాదిరిగానే పొలం వద్దకెళ్లి పశుగ్రాసం కోస్తుండగా.. గడ్డిలో ఉన్న విద్యుత్ తీగలు గుర్తించక విద్యుత్ ప్రమాదానికి గురై మహిళా రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని సీతారామాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహిళా రైతు ఉప్పలూరి లక్ష్మీదేవి(40) భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఆమె వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో రోజు మాదిరిగానే గురువారం పశువులకు పశుగ్రాసం కోసుకునేందుకు వెళ్లింది. విద్యుత్ మోటార్ సమీపంలో గడ్డి కోస్తుండగా ఎల్‌టీ పోల్ నుంచి విద్యుత్ మోటార్ స్టార్టర్‌కు సర్వీసు అమర్చి ఉంది. గడ్డి కోస్తున్న లక్ష్మీదేవి ప్రమాదవశాత్తు సర్వీసు వైర్‌ను కొడవలితో కోసింది. దీంతో విద్యుత్ ప్రమాదానికి గురైన లక్ష్మీదేవి పడిపోయింది. గుర్తించిన స్థానికులు సమీపంలోని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి వివాహమైన కూతురు ఉంది. విద్యుత్ ప్రమాద విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ సాయి ప్రసాద్, డీఈ శ్రీనివాసులరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కమలాపురం : కమలాపురం రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(60) గురువారం తెల్లవారు జామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాస్ వర్మ తెలిపారు. సంఘటన విషయాన్ని రైల్వే సిబ్బంది ద్వారా తెలుసుకున్న ఆయన ఘటనా స్థలానికి చేరుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు కాషాయం రంగు చొక్కా వేసుకున్నాడని, చేతిపై పచ్చ బొట్టు ఉందని వివరించారు. మృతి చెందిన వ్యక్తి గురించి వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ 94409 00811, సీఐ 94406 27398 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాయచోటిటౌన్ : రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యకి (65) మృతి చెందాడు. గతకొన్ని రోజులుగా ఆయన రాయచోటి రూరల్ పరిధిలోని చెన్నముక్కపల్లె సమీపంలో పొలాల వద్ద గుడారాలలో ఉంటూ పట్టణ పరిసర ప్రాంతాలలో తోపుడు బండిపై బెడ్ షీట్లు విక్రయించేవాడని తెలిసింది. చిత్తూరు జిల్లా అయిరాలకు చెందిన వ్యక్తి అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

16 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ


మాట్లాడుతున్న కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి

కడప అర్బన్ : ప్రతి పిటీషన్‌పై రూ. 20ల వెల్ఫేర్ స్టాంప్ అతికించాలని నిర్ణయం తీసుకోవడాన్ని నిరసిస్తూ ఈనెల 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు న్యాయవాదులంతా విధులను బహిష్కరించాలని తీర్మానం చేసినట్లు కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి తెలిపారు. ప్రతి పిటీషన్‌పై రూ. 20 స్టాంప్ అతికించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు.

సర్వం.. ఆక్రమణల పర్వం!

- కబ్జాకోరల్లో బస్టాండు స్థలాలు
- డ్రైనేజీ కాలువలను సైతం వదలని వైనం
- ఆక్రమణలతో నిత్యం ప్రమాదాలు


ఎన్‌హెచ్ 340 రోడ్డు పై ఉన్న బస్టాండు ముఖచిత్రం


బస్టాండులో దుకాణాలపైకి దూసుకెళ్లిన వాహనాలు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండ మేజర్ పంచాయతీలో ఎన్‌హెచ్ 340కు సంబంధించి రోడ్డుకిరువైపులా ఉన్న స్థలాలు కబ్జాకు గురయ్యాయి. దీంతో రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాలు దుకాణాలపై దుసుకెళుతున్నాయి. ప్రతి నిత్యం బస్టాండులో రోడ్డుప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్‌హెచ్ 340కి ఇరువైపులా ఉన్న పంచాయతీ, శ్మశాన స్థలాలను కబ్జాచేశారు. చివరకు డ్రైనేజీ కాలువలను కూడా ఆక్రమించుకొని వాటిపై అద్దెలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలు నిర్వహించుకొనే విషయమై నిత్యం బస్టాండులో ఘర్షణలు జరుగుతున్నాయి.

ఎన్‌హెచ్ 340తో రూపురేఖలు మారిన బస్టాండు

స్థానిక బస్టాండు కడప–బెంగళూరు జాతీయరహదారి ఎన్‌హెచ్ 340పై విస్తరించి ఉంది. ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో బస్టాండులో నిర్వహించుకొనే పలు దుకాణలను తొలగించేశారు. దీంతో బస్టాండు రూపురేఖలే మారిపోయాయి. రోడ్డుకిరువైపులా మూడు అడుగుల మేర డ్రైనేజీలను కూడా నిర్మించారు.

ఎన్‌హెచ్ 340 స్థలాలు కబ్జా

వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిన బస్టాండులో ఎన్‌హెచ్ 340కు సంబంధించి స్థలాలు, పంచాయతీ, శ్మశాన స్థలాలు ఇష్టానుసారంగా కబ్జాకు గురయ్యాయి. కబ్జాకు గురైన స్థలాల్లో సుమారు 100 దుకాణాలను అనధికారికంగా నిర్వహించుకుంటున్నారు. వీటిపై ఆక్రమణదారులు రూ. 3వేలు నుంచి రూ. 6వేలు వరకు అద్దెలు వసూలు చేసుకుంటున్నారు.

దుకాణాలపై దూసుకెళుతున్న వాహనాలు

స్థానిక జెడ్పీహైస్కూల్ నుంచి బస్టాండు మీదుగా గుర్రంకొండ కోట వరకు రోడ్డు కిరువైపులా ఉన్న ఎన్‌హెచ్ 340 స్థలాల్లో అక్రమంగా దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. బస్టాండుతో పాటు పలుచోట్ల ఇష్టానుసారంగా దుకాణాలు వెలిశాయి. కనీసం ద్విచక్రవాహనాలు నిలుపుకొనేందుకు కూడా వీలులేకుండా స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో వాహనాలు, లారీలు, ద్విచక్రవాహనాలు అదుపుతప్పి దుకాణాల్లోకి దూసుకెళుతున్నాయి. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి ప్రాణాపాయం తప్పింది.

డ్రైనేజీ కాలువపై అద్దెలు వసూళ్లు

ఆక్రమణలకు కాదేది అనర్హం అంటూ పలువురు ఆక్రమణదారులు బస్టాండులోని డ్రైనేజీ కాలువలను కూడా ఆక్రమించేశారు. ఎన్‌హెచ్ 340 రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా బస్టాండులో ఇటీవల విశాలమైన డ్రైనేజీలు నిర్మించారు. వీటిని కూడా అక్రమార్కులు వదల్లేదు. వీటిని ఆక్రమించుకొని చిల్లర దుకాణాలు, తోపుడుబండ్లు నిర్వహించుకొనేందుకు అద్దెలకు ఇచ్చారు. చివరకు కాలువలపై రేకుల షెడ్లకు కూడా రూ. 3వేల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు.

ఆక్రమణలతో ఇబ్బందులు



బస్టాండులో రోడ్డుకిరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలను పలువురు ఆక్రమించుకున్నారు. కొంతమంది డ్రైనేజీలను కూడా ఆక్రమించుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వాహనాలు దుకాణాలపైకి దూసుకెళుతున్నాయి. బస్టాండు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతోంది.

– మహబూబ్‌బాషా, గుర్రంకొండ.

నోటీసులు జారీ చేశాం



ప్రభుత్వ, పంచాయతీ స్థలాలను ఆక్రమించుకొన్నవారికి నోటీసులు జారీ చేశాం. ఇప్పటికే ఆ స్థలాలన్నీ సర్వే కూడా చేశాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– విశ్వనాథ్, పంచాయతీ ఈఓ, గుర్రంకొండ.

డ్రైనేజీలపై దుకాణాలతో ప్రమాదం



బస్టాండులో ఎన్‌హెచ్ 340 రోడ్డు కిరువైపులా ఉన్న డ్రైనేజీలపై దుకాణాలు నిర్వహించకూడదు. ఇటీవల బస్టాండులో వాహనాలు దుకాణాలపైకి దూసుకెళ్లిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి. డ్రైనేజీలపై కాకుండా అవతలివైపు దుకాణాలు నిర్వహించుకోవాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– దిలీప్‌కుమార్, ఎస్ఐ, గుర్రంకొండ